సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం। 2। డిసెంబర్। 2023



వణికిస్తున్న చలి
పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. రోజురోజుకూ చలి గాలుల తీవ్రత పెరుగుతోంది.
8లో ▸



ఉత్సాహంగా పోటీలు
ఏలూరులో విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. పలువురు క్రీడా నైపుణ్యంతో ఆకట్టుకున్నారు.
8లో ▸



వెలమ సంఘం సత్కారాలు
వీరవాసరం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అభినందన సత్కారం నిర్వహించారు. ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు హాజరయ్యారు.
8లో ▸

బోధనలో డిజిటల్ విప్లవం

స్మార్ట్‌గా చదువులు
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి చర్యలు
- నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం
- 206 హైస్కూళ్లలో పంపిణీకి ఏర్పాట్లు
- గతేడాది 16,726 మందికి అందజేత



సాంకేతికత.. విజ్ఞానానికి బాట.. భీమవరం పీఎస్‌ఎం గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులు

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చింది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు మనబడి పథకంలో తీర్చిదిద్దుతోంది. విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు, బ్యాగులు, షూలు వంటివి సమకూర్చడమే గాక బోధనా పద్ధతుల్లో కూడా వినూత్న పద్ధతులు పాటించేలా సంస్కరణలు చేసింది. దీంతో విద్యాప్రమాణాలు పెరగడంతో ప్రభుత్వ స్కూళ్లలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. డిసెంబర్‌లో ట్యాబ్‌లు ఉచితంగా అందజేసేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. గత ఏడాది జిల్లాలోని 206 పాఠశాలల్లో 14,353 మంది విద్యార్థులు, 2,373 మంది ఉపాధ్యాయులకు మొత్తం 16,726 ట్యాబ్‌లు పంపిణీ చేయగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో దాదాపు 16 వేల ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా..
ప్రభుత్వ పాఠశాలల్లో చదుకునే విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడాలనే ప్రభుత్వ బలమైన సంకల్పంతో విద్యార్థులకు తెలుగు మీడియంతోపాటు ఇంగ్లిష్ మీడియం కూడా ప్రవేశపెట్టి కార్పొరేట్ స్కూల్ విద్యార్థులతో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నారు. మొక్కుబడిగా ట్యాబ్‌లిచ్చి చేతులు దులుపుకోకుండా వాటి వినియోగం, మరమ్మతులపై కూడా ప్రభుత్వం నిఘాపెట్టింది. ట్యాబ్‌తో పాఠశాలల్లో బోధించేందుకు తరగతి గదుల్లో ఐఎఫ్ ప్యానెల్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేస్తుండటంతో విద్యార్థులకు సులభంగా బోధించేందుకు మార్గం సుగమమైంది. విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించే సమయంలో పొరపాటున స్క్రీన్ డ్యామేజీ జరిగితే ప్రభుత్వమే రిపేరు చేయించే నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకిచ్చిన ట్యాబ్‌లు దుర్వినియోగం గాకుండా జిల్లా విద్యాశాఖాధికారితోపాటు డీవైఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. ప్రతినెలా డిజిటల్ అసిస్టెంట్లు పాఠశాలను సందర్శించి ట్యాబ్‌ల పనితీరును పరిశీలిస్తారు.

గతేడాది ట్యాబ్‌ల పంపిణీ

పాఠశాలలు	206
విద్యార్థులు	14,353
ఉపాధ్యాయులు	16,726

ఈ ఏడాది పంపిణీ చేసే ట్యాబ్‌లు సుమారు
16,000

సద్వినియోగం చేసుకునేలా మార్గదర్శకాలు



స్కూల్ విద్యార్థులకు పంపిణీ చేసే ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించింది. యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ సాయంతో చర్యలు చేపట్టింది. ట్యాబ్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడానికి ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్‌పీ, పాఠశాల హెచ్‌ఎంలు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నాం.
– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

నేటి నుంచి ఓటరు నమోదు డ్రైవ్

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఓటు నమోదు, ఓటర్ల జాబితాలో మార్పుచేర్పులకు సంబంధించి శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ స్టేషన్లలో సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ బూత్‌స్థాయి అధికారులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. జిల్లాలోని 20 మండలాలు, 6 మున్సిపాలిటీల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నాయని ఓటర్లు వెళ్లి జాబితాలను పరిశీలించుకోవాలని కోరారు. కొత్త ఓటు నమోదుకు ఫారం–6, ఓటు తొలగింపు, మరణించిన లేదా ఒక వ్యక్తి రెండు ఓట్లు కలిగి ఉన్నవారికి, శాశ్వత బదిలీ అయిన వారి కోసం ఫారం–7ను తీసుకుని వివరాలు నమోదు చేసి ఇవ్వాలన్నారు. ఓటరు లిస్టులోని అన్ని రకాల సవరణలతో పాటు ఓట్ల బదిలీ చేసుకోవడానికి ఫారం–8 పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు సంబంధిత రికార్డులు జతచేసి బూత్‌స్థాయి అధికారులకు అందజేయాలన్నారు. రెండ్రోజుల పాటు జిల్లాలో అన్ని పోలింగు కేంద్రాల వద్ద జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు.

న్యూస్‌రీల్

వరి మాసూళ్లు వాయిదా వేసుకోవాలి



జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం: వాతావరణంలో మార్పులు, తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి పంట మాసూళ్లను నాలుగు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 2.11 లక్షల ఎకరాల్లో సార్వా వరి సాగుచేయగా దాదాపు 50 శాతం మాసూళ్లు పూర్తయ్యాయని, ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. ధాన్యంలో 21 శాతం తేమ ఉన్నా నిబంధనలకు లోబడి విక్రయించవచ్చన్నారు. వాతావరణ శాఖ ఆది, సోమవారాల్లో వర్షాలు కురిసే అవకాశముందని ప్రకటించిందని, మాసూళ్లు వాయిదా వేసుకోవడంతోపాటు ఇప్పటికే కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలన్నారు. వర్షానికి ధాన్యం తడిస్తే ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. చేలల్లోని వర్షం నీటిని త్వరగా బయటకు వెళ్లే మార్గాలు ఏర్పాటుచేసుకోవాలని అన్నారు.

భీమవరం మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ఆర్డీఓ



ఆర్డీఓ శ్రీనివాసులురాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పురపాలక సంఘం స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కమిషనర్ ఎం.శ్యామల పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీ గౌరు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

160 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని ఖాళీగా ఉన్న 160 గ్రామ, వార్డు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. 1.12.2023 నాటికి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఈనెల 6న దరఖాస్తులు పరిశీలిన, 7న సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మౌఖిక పరీక్ష, 8న ఎంపికైన వలంటీర్ల వివరాల వెల్లడి, 9న శిక్షణ తరగతులు, 11 నుంచి వలంటీర్లు పని చేయడం ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రేపు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ ఉపకార వేతన పరీక్షను ఆదివారం నిర్వహించనున్నట్టు డీఈఓ పి.శ్యామ్ సుందర్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 13 కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని, 3,257 మంది విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు హాల్‌టికెట్లతో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌లో విద్యార్థుల ఫొటో ప్రింట్ కాని పక్షంలో హెచ్‌ఎం సంతకంతో అదనంగా మరో ఫొటో తీసుకుని పరీక్షకు రావాలని తెలిపారు.

'పది' పరీక్ష ఫీజు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే ఏప్రిల్‌లో జరిగే ఎస్‌ఎస్‌సీ, ఓఎస్‌ఎస్‌సీ, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువును పొడిగించినట్టు డీఈఓ పి.శ్యామ్ సుందర్ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 5 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.50 ఫైన్‌తో ఈనెల 10 వరకు, రూ.200 ఫైన్‌తో ఈనెల 12 వరకు, రూ.500 ఫైన్‌తో ఈనెల 14 వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'తో సత్వర పరిష్కారం

ద్వారకాతిరుమల: అర్జీదారులు సంతృప్తి చెందే రీతిలో స్పందన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అన్నారు. ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ దేవరాయ కాపు కల్యాణ మండపంలో శుక్రవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తులపై జిల్లాస్థాయిలో సమీక్షిస్తామన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ 186 దరఖాస్తులు అందాయన్నారు.

రేషన్ బియ్యంలో పోషకాలు మెండు



రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న జేసీ

ద్వారకాతిరుమల: ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యమని, వాటిని ప్రజలు తప్పకుండా వాడాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి సూచించారు. ద్వారకాతిరుమలలో ఉగాది మండపం వెనుక రోడ్డులో ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న రేషన్ పంపిణీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతుందా, లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు పోషకాహార లోపం ఉండకూడదని రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ కెర్నెల్స్ కలిపి అందిస్తున్నామని, ప్రజలు తప్పక వినియోగించాలన్నారు. ప్రతి ఎండీయూ వాహనం లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి రేషన్ బియ్యాన్ని అందించాలని, కందిపప్పు రూ.67, గోధుమపిండి రూ.16, అర కిలో పంచదార రూ.17కు అందిస్తున్నామన్నారు. వాహనంలో తూకం, ఈ–పోస్ మెషీన్‌ను ఆమె పరిశీలించారు. రేషన్ వాహనం ద్వారా ప్రతినెలా సరుకులు సక్రమంగా అందుతున్నాయని ప్రజలు ఆమెకు తెలియజేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, ఆర్డీఓ అద్దయ్య, తహసీల్దార్ పి.సతీష్, డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి ఆమె వెంట ఉన్నారు.

'ఓపెన్' ప్రవేశాల గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో దూర విద్య విధానంలో నిర్వహించే 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్టు డీఈఓ పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 5వ తేదీ వరకూ రూ.200 అపరాధ రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ అధీకృత స్టడీ సెంటర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

మంత్రి కారుమూరి



తణుకులో సేఫ్ కేర్ సెంటర్ వైద్యుడు, సిబ్బందిని అభినందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: ఎయిడ్స్‌పై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త కేసులు నమోదు కావడం బాధాకరమని, రానున్న రోజుల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపరాదన్నారు. క్రమం తప్పకుండా సక్రమంగా మందులు వాడితే వారి జీవనకాలం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఐఎంఏ సీనియర్ వైద్యులు తాతిన రామబ్రహ్మం అందరితో ప్రతిజ్ఞ చేయించగా, మంత్రి కారుమూరి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాట్ల సుందరరామరాజు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సంఘ అధ్యక్షురాలు ఫహిమా, ఐఎంఏ అధ్యక్షుడు ఎం.రఘు, కార్యదర్శి డాక్టర్ రమేష్‌కుమార్, ఆస్పత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

తణుకు సేఫ్ కేర్ సెంటర్‌కు బెస్ట్ అవార్డు
హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలందిస్తున్న తణుకు సేఫ్ కేర్ సెంటర్‌కు బెస్ట్ సేఫ్ కేర్ సెంటర్ అవార్డు దక్కింది. జిల్లాలో తణుకు, భీమవరం, తాడేపల్లిగూడెం సేఫ్ కేర్ సెంటర్ల ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు వైద్యసేవలు అందుతుండగా ఈ ఏడాది ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో తణుకు కేంద్రానికి పురస్కారం దక్కింది. శుక్రవారం భీమవరంలో డీఎంహెచ్‌ఓ మల్లేశ్వరరావు చేతులమీదుగా సేఫ్ కేర్ సెంటర్ ఉద్యోగి అవార్డును అందుకున్నారు. సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న కౌన్సిలర్ ఎ.శ్రీనాథ్, ఫార్మసిస్ట్ డి.షర్మిల, ల్యాబ్ టెక్నీషియన్ కె.పురుషోత్తం, ఎఫ్‌సీ జె.జ్యోతి, ఐసీటీసీ కౌన్సిలర్ జి.నిర్మల అవార్డులు అందుకున్నారు. వీరందరినీ మంత్రి కారుమూరి అభినందించారు.

బాల్య వివాహాల నివారణకు పటిష్ట చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): బాల్య వివాహాలను నిరోధించడంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. బాల్య వివాహాలు, పోషకాహార లోపం కలిగిన పిల్లలు, వైఎస్సార్ సంపూర్ణ కిట్స్, ప్రీ స్కూల్ పిల్లల హాజరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధించడంలో కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాల్య వివాహం చేసుకుంటే పోక్సో కేసు పెట్టడంతో పాటు బైండోవర్ కేసులను బుక్ చేయాలన్నారు. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదన్నారు. ఒక్క కేసు నమోదైనా సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతినెల చైల్డ్ కేర్ మీటింగ్‌ను ఆర్డీఓ స్థాయిలో నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత నివారణకు వంద రోజులు కార్యక్రమం నిర్వహించాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ కిట్స్ నూరు శాతం అందేలా చూడాలన్నారు. మూడేళ్లలోపు పిల్లలకు ఇంటి వద్దకే పోషకాహారం అందించాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లల హాజరు శాతం నూరుశాతం నమోదు కావాలన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ పీడీ బి.సుజాత రాణి, సీడీపీఓలు టి.సరస్వతి, సీహెచ్ ఇందిర, వాణి విజయరత్నం, బి.ఊర్మిళ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో దరఖాస్తుల పరిశీలన
ఓటరు దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 8,900 మంది యువ ఓటర్లకు ఓటు హక్కు కల్పించామని, మరో 2 వేల మందికి ఓటు హక్కు కల్పించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని, మరో 10 వేల ఓటర్ల నమోదుకు అవకాశం ఉందన్నారు. తణుకు బ్యాంకర్స్ కాలనీలో శాశ్వతంగా వలస వెళ్లడం వల్ల కొన్ని ఓటర్లను డిలీట్ చేశామని, ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలిన చేస్తున్నామన్నారు. భీమవరంలో 238 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని ఈఆర్వో విచారణ చేయాల్సి ఉందన్నారు. ఆధార్ ఫొటోని తప్పుగా అప్‌డేట్ చేసిన కారణంగా జిల్లాలో ఇద్దరు బీఎల్‌ఓలపై చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 22 మంది నోడల్, 139 మంది సెక్టార్ అధికారులకు నియమించామన్నారు. ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, అచ్యుత్ అంబరీష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, ఎన్నికల డీటీ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

డీటీఓ ఉమామహేశ్వరరావు



ప్రమాదాల నివారణ సదస్సులో మాట్లాడుతున్న డీటీఓ ఉమామహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): ఆటోడ్రైవర్లు ప్రమాదాల జరగకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు సూచించారు. శుక్రవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రహదారి కూడళ్లల్లో సిగ్నల్స్‌ను విధిగా పాటించాలన్నారు. ఆటో నడుపుతున్న సమయంలో క్రమశిక్షణ పాటించడం వల్ల చలానాలు కట్టే అవసరం ఉండదన్నారు. ప్రయాణం చేసే సమయంలో మీ కుటుంబం ఎదురుచూస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వాహనమిత్ర సహాయాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ పొందడానికి యూనియన్ నాయకులు చొరవ చూపాలన్నారు. భీమవరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకటరమణ మాట్లాడుతూ ఆటో నడిపే సమయంలో మద్యం, మత్తు పదార్థాలను సేవించరాదన్నారు. మరో ఎంవీఐ కేఎస్‌ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపరాదన్నారు. ట్రాఫిక్ సీఐ సి.దాసు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఏఎంవీఐలు ఎం.రవికుమార్, ఎస్‌ఎల్‌ఎస్ లక్ష్మి, భీమవరం ఆటో యూనియన్ అధ్యక్షుడు పి.గోపి, ఇంటి సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

గోపినాథపట్నంలో వేడుకగా భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



యజ్ఞ క్రతువులో పాల్గొన్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు



భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం.. స్మరణలు మార్మోగాయి. వేద మంత్రోచ్ఛరణలు.. సన్నాయి మేళాలు.. జై శ్రీరామ్ నినాదాల నడుమ భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకగా జరిగింది. ఉంగుటూరు మండలం గోపినాథపట్నంలో శుక్రవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాభివృద్ధి కోసం విశేష పూజలు, యజ్ఞాలు, హోమాలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం కుంభ కలశాహనం, గోదర్శనం, పచ్చకర్పూర నీరాజనం, మహాపూర్ణాహుతి, మహదాశీర్వచనం వంటి క్రతువులు నిర్వహించారు. ఆగమ వేదస్పతి వేదాంత గోపాల చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొట్టు మురళీ, కొట్టు తాతాజీ, కొట్టు విశాల్ దంపతులు, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ఈఓలు పెద్దిరాజు (శ్రీశైలం మల్లన్న), కేఎస్ రామారావు (ద్వారకాతిరుమల), కె.రామారావు (శ్రీకాళహస్తి), కాకినాడ డీసీ విజయరాజు, ఏలూరు ఏసీ సీహెచ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన: విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు హనుమాన్ చాలీసా పుస్తకం, కాణిపాకం వినాయక లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ద్వారకాతిరుమల, కాణిపాకం ఆలయాల ప్రచార రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి

ఏలూరు రూరల్: యువతీ, యువకులు సహకారంతో ఎయిడ్స్ రహిత సమాజం నిర్మించగలమని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన కార్యక్రమలో కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌ని సమాజం నుంచి పారదోలేందుకు యువత ముఖ్య పాత్ర పోషించాలన్నారు. హెచ్‌ఐవీ తొలిదశలో గుర్తించడంతో పాటు ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఐవీ బారిన పడిన వారిని సమాజం నుంచి వెలివేయకుండా వారిపై ఆదరణ చూపేలా కృషి చేయాలన్నారు. సామాజిక రుగ్మతలపై యువత దృష్టి నిలిపి ప్రజలను చైతన్యపరిచి సమాజ పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ వలంటీర్లు, సీఆర్‌ఆర్ ఎన్‌సీసీ క్యాడెట్లతో పాటు కళాశాల విద్యార్థులను ఆయన అభినందించారు.

క్లుప్తంగా

3న భీమవరంలో చెస్ పోటీలు



భీమవరంలో చెస్ పోటీల వివరాలను వెల్లడిస్తున్న సుబ్బరాజు

భీమవరం : భీమవరం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఈనెల 3న రాష్ట్ర స్కూల్ చిల్డ్రన్స్ ర్యాంకింగ్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు సేవాసమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. వివిధ జిల్లాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పేర్లు నమోదుచేసుకున్నారని వారికి వసతి, భోజన సదుపాయాలను సేవాసమితి ఏర్పాటుచేస్తున్నట్లు సమితి కార్యదర్శి సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. విజేతలు ర్యాంకింగ్‌తోపాటు బీహార్‌లో నిర్వహించే జాతీయస్థాయి స్కూల్ చిల్డ్రన్స్ చెస్ పోటీల్లో అర్హత సాధిస్తారని కిషోర్ వివరించారు.

లోకేష్ పాదయాత్రకు స్పందన కరువు

భీమవరం: యువగళం పేరుతో పాదయాత్రచేస్తున్న నారా లోకేష్ యాత్రకు ప్రజాస్పందన కరువైందని దీంతో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. శుక్రవారం భీమవరంలో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసినా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు ఒరగబెట్టిందేమి లేదని దుయ్యబట్టారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరూ కోరుకోరన్న చంద్రబాబు ఆ వర్గం ప్రజలకు ఎందుకు మేలు చేస్తారని మంగరాజు ప్రశ్నించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్న ముఖ్యమంత్రి జగన్ ఎస్సీల పట్ల ప్రేమతో విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తున్నారని కొనియాడారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఉప్పలమెట్టపై ఉన్న గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల వసతిగృహం నుంచి బాలిక అదృశ్యమైంది. హౌస్ టీచర్ తేనేటి కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఐఎస్ జగన్నాథపురానికి చెందిన బాలిక గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతోంది. శుక్రవారం ఉదయం కళాశాల వసతిగృహం నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు.



పరుగుపందెంలో..



100 మీటర్ల పరుగుపందెంలో బాలికలు



డిస్కస్ త్రోలో సాయపడుతూ..

ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల పోటీలు



జావెలిన్ త్రో

మాటలు రావని.. కనిపించదని.. వినిపించదని మమ్మల్ని చూసి జాలిపడకండి. మాలో ఉన్న ప్రతిభను గుర్తిస్తే చాలు.. మేము ఎందులోనూ తక్కువ కాదంటూ తమ ప్రతిభను ప్రదర్శించారు విభిన్న ప్రతిభావంతులు. శుక్రవారం ఏలూరులో జరిగిన ఆటల పోటీల్లో పెద్ద ఎత్తున విభిన్న ప్రతిభావంతులు పోటీపడ్డారు. త్రో బాల్, జావెలిన్ త్రో, 100 మీటర్ల పరుగు, డిస్కస్ త్రో లాంటి క్రీడల్లో పాల్గొని సత్తా చాటారు. ఒకరికొకరు సహాయపడుతూ తమవారిని పోటీలు జరిగే ప్రాంతానికి తీసుకొచ్చారు. ఈ పోటీలు చూసేందుకు వచ్చిన విద్యార్థులు పోటీదారులను ఉత్సాహపరిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ ఆటల పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

– ఏలూరు రూరల్



ట్రై సైకిల్ విభాగంలో పోటీపడుతూ ..



షాట్‌పుట్‌లో..

వెలమ సంఘం ఆధ్వర్యంలో సత్కారాలు



వీరవాసరంలో మాట్లాడుతున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, చిత్రంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

వీరవాసరం: వీరవాసరం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వీరవాసరంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు, ఆకివీడు మున్సిపల్ చైర్మన్ జామి హైమావతిలకు అభినందన సత్కారం నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వెలమ కులస్తులకు రెండే తెలుసునని ఒకటి సాయం, రెండు వ్యవసాయం అని, కోటగిరి శ్రీధర్ గత ఎన్నికల్లో తన గెలుపు కోసం వీరవాసరం మండలంలో ప్రత్యేక శ్రద్ధతో సహకరించారని తెలిపారు. జెడ్పీ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వెలమ కులస్తులు రాజకీయ పదవుల్లో బాగా వెనకబడి ఉండేవారని, ప్రస్తుతం అధిక శాతంలో ఎమ్మెల్యేలుగా, ,ఎంపీలుగా పదవుల్లో ఉంటూ ప్రజాసేవలు అందిస్తున్నారన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వ్యక్తిగా మంచి స్నేహితుడని అలాంటి వ్యక్తులకు మన సంఘం పూర్తి సహకారం అందించాలన్నారు. వేదికపై ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జెడ్పీటీసీ కోరిపల్లి జయలక్ష్మి, ఉంగుటూరు ఏఎంసి డైరెక్టర్ మరడా రమావతి, వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు, సొసైటీ చైర్మన్ కొలుపూరి గౌరీ, ఎంపీటీసీ బోను జోత్స్నాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీని వణికిస్తున్న చలి

- రోజురోజుకూ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- సాయంత్రం నుంచే తీవ్ర చలిగాలులు
- డిసెంబర్ నుంచి తీవ్రమయ్యే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో కొద్ది రోజులుగా పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న చలితీవ్రతతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల కొండ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటలు దాటితే కానీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే సాయంత్రం నాలుగు గంటలకే చలిగాలులు ఎక్కువగా వీస్తుండటంతో రాత్రి కాకముందే ఇళ్లకు చేరుకుంటున్నారు. వాతావరణంలో తేమశాతం పెరిగి బాక్టీరియా, వైరస్‌లు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో తీవ్రమైన జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు వెళుతున్నవారి సంఖ్య కూడా పెరుగుతోంది. డిసెంబర్, జనవరిలో చలి మరింత పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులు, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు, మధుమేహ బాధితులు, అలాగే కేన్సర్, గుండె, ఆస్తమా వంటి సమస్యలతో బాధపడుతున్నవారు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు. చర్మం పొడిబారిపోకుండా తేమను పెంచే లేపనాలు, కొబ్బరినూనె, ఆలివ్ ఆయిల్ వంటివి చర్మానికి పట్టించాలని, చలి తీవ్రంగా ఉన్న సమయాల్లో వాహనాలు నడపడం మంచిది కాదని, మంచులో ప్రయాణం అత్యంత ప్రమాదకరమని సూచిస్తున్నారు. చలి కారణంతో నీటిని తాగడం తగ్గిస్తుంటారని, ఇది సరికాదని, నీటిని తగిన మోతాదులో తప్పనిసరిగా తాగాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఏజెన్సీలో కమ్ముకున్న పొగమంచు



రౌడీషీట్లు ఎత్తివేత

ఎస్పీ రవిప్రకాష్



భీమవరం: జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో కేసులు నమోదై సత్ప్రవర్తన కలిగిన 860 మందిపై రౌడీషీట్లను మూసివేస్తున్నట్లు ఎస్పీ రవిప్రకాష్ శుక్రవారం చెప్పారు. సత్ప్రవర్తన ఆధారంగా గత అయిదేళ్లుగా ఎలాంటి నేర ప్రమేయంలేని వారిని గుర్తించి వారిపై కేసులను తొలగిస్తున్నట్లు చెప్పారు. వారిలో 653 మంది సస్పెక్ట్ షీట్స్, 35 కేడీ, 2 డీసీ, 170 రౌడీషీట్స్‌ను మూసివేస్తున్నట్లు రవిప్రకాష్ వివరించారు. ప్రస్తుతం తొలగించిన వివిధ షీట్స్‌లోని వ్యక్తులు సత్ప్రవర్తన కలిగి సమాజంలో మంచి పేరుతో జీవించాలని తిరిగి నేర ప్రవృత్తిని ఎంచుకొంటే వారిపై షీట్స్ ఓపెన్‌చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విదేశీ విద్యార్థులకు ప్రత్యేక వసతులు



ఫీల్ ఎట్ హోం కార్యక్రమంలో విదేశీ విద్యార్థులతో ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: ఉద్యానవర్సిటీలో విద్యనభ్యసించే విదేశీ విద్యార్థులకు ఆయా ప్రాంతాల అభిరుచులకు అనుగుణంగా ఆహారం అందచేయడంతో పాటు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని ఉప కులపతి డాక్టర్ తోలేటి జానకిరామ్ అన్నారు. ఫీల్‌ఎట్‌హోం కార్యక్రమంలో భాగంగా విదేశీ విద్యార్థులకు ఉద్యాన కళాశాల బాలుర, బాలికల వసతి గృహాలలో కల్పించిన సదుపాయాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి కాకుండా నేపాల్, భూటాన్, శ్రీలంక, ఆఫ్రికా దేశాల నుంచి ఐసీఏఆర్ కేటగిరీ కింద బీఎస్సీ, ఎంఎస్సీ హార్టీకల్చర్ కోర్సులు చదవడానికి వచ్చిన విద్యార్థులు సుమారు 50 మందికి ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫీల్ ఎట్ హోం కార్యక్రమం నిర్వహించామన్నారు. ఏసీలు, ప్రత్యేక ఆహారం అందించడం వంటివి సంతృప్తికరంగా ఉన్నాయని నేపాల్‌కు చెందిన విద్యార్థి ఆశోక్ షా, భూటాన్‌కు చెందిన సంఘయ్ డంచెస్ అనే విద్యార్థులు వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. విదేశీ విద్యార్థులకు ఇక్కడి వాతావరణానికి అనుకూలంగా ఉండేలా రూ.80 లక్షలతో నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించనున్నామన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

కొయ్యలగూడెం: స్థానిక బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ శుక్రవారం తెలిపారు. ఎస్సీ పేటలో పాడుబడి ఇంటి గోడ వద్ద తుప్పల్లో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారన్నారు. సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసు ఉంటుందని, మృతదేహం గుర్తుపట్టలేని విధంగా కుళ్లిపోయిందని చెప్పారు. పాడుబడిన ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బాలికను మోసగించిన వ్యక్తి అరెస్టు

ఏలూరు టౌన్: దెందులూరు మండలం సత్యనారాయణపురానికి చెందిన కొక్కిలిగడ్డ రమేష్‌బాబును అదే గ్రామానికి చెందిన బాలికను మోసగించి వివాహం చేసుకున్న కేసులో అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు తెలిపారు. బాలికను ప్రేమ పేరుతో మోసం చేశాడని, అతని అక్క చందోలు వీరమ్మ, వదిన కొక్కిలిగడ్డ వనితలు నేరానికి ప్రేరేపించడం, సహకరించడంతో వారిని కూడా అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచామని తెలిపారు. వారికి జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఏలూరులోని ప్రైవేటు కాలేజీలో చదువుతున్న బాలిక కనిపించడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు ఈ ఏడాది మే 15న ఇచ్చిన ఫిర్యాదుపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో బాలికను గుర్తించి ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసి వైద్యపరీక్షల అనంతరం నిందితులపై పోక్సో కేసు నమోదు చేశారు.

● గడపగడపకు సంక్షేమం



అత్తిలి : మండలంలోని స్కిన్నెరపురంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో బ్రోచర్‌ను అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఉండి: శివారులోని ఉప్పగుంటలో సంక్షేమ పథకాల బ్రోచర్‌లు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

మామిడిని కాపాడుకోవాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో మామిడిపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పండ్లలో రారాజైన మామిడిని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మామిడి తోటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నూజివీడు మామిడి ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని, దానిని మరింత నాణ్యతతో పండించాలన్నారు. దీనికి రైతులు శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలు పాటించి ముందుకెళ్లాలన్నారు. రూ.275 కోట్లతో నూజివీడు మండలం సిద్ధార్థనగర్ ప్రాంతంలో రూ.26 ఎకరాల్లో మ్యాంగో అండ్ పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాబోయే రోజుల్లో మామిడికి మహర్దశ రానుందని, తోటలను ఎవరూ నరికివేయవద్దన్నారు. ఉద్యానశాఖ మామిడి కాయలకు పెట్టేందుకు కవర్లను రాయితీపై సరఫరా చేయాలన్నారు. మామిడి శాస్త్రవేత్తలు బొర్రా కనకమహాలక్ష్మి, రాధారాణిలు మాట్లాడుతూ పూత వచ్చే సమయానికి చలి వాతావరణం ఉండాలని, తెల్లపూత సమయంలో రసాయన మందులు పిచికారీ చేయొద్దన్నారు. పొటాషియం నైట్రేట్, జింక్, బోరాన్, మాంగనీస్‌లను పిచికారీ చేసుకోవాలని, దీనివల్ల చెట్టు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు ఎట్టి పరిస్థితుల్లో నీటి తడులు ఇవ్వకూడదన్నారు. తేనెమంచు పురుగు, తామర పురుగుల ఉధృతిని బట్టి రసాయన మందులు పిచికారీ చేయాలన్నారు. ఏలూరు జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.రామ్మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ముసునూరు ఎంపీపీ కొండా దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక



నాగిడి లక్ష్మీ ప్రసన్నకు చెక్ ఇచ్చి అభినందిస్తున్న డీఈవో ఆర్.వెంకటరమణ

భీమవరం అర్బన్: గత నెలలో కేఎల్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో దొంగపిండి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నాగిడి లక్ష్మీ ప్రసన్న ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. విద్యాశాఖ కార్యాలయంలో లక్ష్మీ ప్రసన్నకు శుక్రవారం రూ. 3 వేలు చెక్ అందజేసి అభినందించారు. డీఈవో మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 7 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలో పాల్గొనగా నాగిడి లక్ష్మీ ప్రసన్న గుర్రపు డెక్క, అరటి ఆకులు, బెరడులతో తయారు చేసిన శానిటరీ బయో నాప్కిన్స్ ప్రాజెక్టు ఎంపికైందన్నారు. లక్ష్మీ ప్రసన్నను ఉప విద్యాశాఖాధికారి డి.శ్రీరామ్, అకాడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ రాజు, ప్రధానోపాధ్యాయుడు పీఎల్ బాషా ఖాన్, గైడ్ టీచర్ పి.రేవతి అభినందించారు.

బాలికపై అత్యాచారం కేసులో జైలుశిక్ష

పెనుగొండ: పెనుగొండ మండలం దొంగరావిపాలెంలో 10 ఏళ్ల దివ్యాంగురాలిపై అత్యాచారం కేసులో మామిడిశెట్టి మోహనరావుకు పోక్సో కోర్టు జైలు శిక్ష విధించినట్లు పెనుగొండ ఎస్సై ఎస్ఎన్ఎస్‌వీ రమేష్ తెలిపారు. బాలిక మేనత్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై బీవై కిరణ్‌కుమార్, డీఎస్పీ జి.పూర్ణ చంద్రరావులు దర్యాప్తు చేశారన్నారు. ప్రస్తుతం ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించడంతో ఏడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానాతో పాటు, బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారని తెలిపారు.

ఆగిరిపల్లిలో ఇనుప పెట్టె కలకలం



ఆగిరిపల్లి : ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని బ్రాహ్మణ వీధిలో దశాబ్దాల కాలం నాటి పాత భవనాన్ని తొలగిస్తుండగా పురాతన ఇనుప పెట్టె బయటపడింది. హైదరాబాదులో ఉండే దేవులపల్లి కృష్ణ ఆగిరిపల్లిలో పురాతన భవనాన్ని ఇటీవల యండురి శివరాంకు విక్రయించారు. రెండు రోజుల క్రితం పురాతన భవనాన్ని తొలగిస్తుండగా పురాతన ఇనుప పెట్టె, ఆరు చిన్న ఇనుప పెట్టెలు బయటపడ్డాయి. స్థల యజమాని గుట్టు చప్పుడు కాకుండా పురాతన ఇనుప పెట్టెను వేరే ప్రాంతంలో భద్రపరిచాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో శుక్రవారం ఉదయం తహసీల్దార్ ఉదయ భాస్కర్, ఏఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో వెళ్లి దానిని స్వాధీనం చేసుకున్నారు. డిసెంబర్ 23న ఈ భవనాన్ని విక్రయించిన దేవులపల్లి కృష్ణ, పురావస్తు అధికారుల సమక్షంలో ఈ పెట్టెను తెరవనున్నట్టు తహసీల్దార్ వెల్లడించారు.

క్లుప్తంగా

ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

తాడేపల్లిగూడెం అర్బన్ : తమ బ్యాంకు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ది.జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డి.సి.సి.బి) మేనేజర్ బసవా సత్యనారాయణ తెలిపారు. స్థానిక డీసీసీబీ బజారు బ్రాంచ్ కార్యాలయంలో ఖాతాదారుల సమావేశాన్ని భీమవరం డివిజన్ ఏజీఎం జి శంకరనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఖాతా ఆవశ్యకత, బీమా ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఫీల్డు ఆఫీసర్ వెంకటేష్, అసిస్టెంట్ మేనేజర్ భాస్కరరావు, బాలాజీ, సాయి, అంజలి, సీతామహాలక్ష్మి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

'గూడెం' ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శివశంకర్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల ఇన్‌ఛార్జ్ తహసీల్దార్‌గా ఎస్.శివశంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన పెంటపాడు డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

రాష్ట్రానికి మంచి పేరు తేవాలి

తాడేపల్లిగూడెం రూరల్: వాటర్ బాడీ సైన్సెస్ ప్రాముఖ్యత, అర్థ గణాంక శాఖకు సంబంధించిన అంశాలపై అందరూ అంకితభావంతో పని చేసి, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని రాష్ట్ర అర్థ గణాంక శాఖ డైరెక్టర్ బి.గోపాల్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి, వెంకట్రామన్నగూడెం, పెంటపాడు మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయ గణాంక అధికారులు అర్థ గణాంక శాఖకు మూల స్తంభాలుగా పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కే.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్, స్టాటస్టికల్ అధికారి, ఉప గణాంకాధికారులు ఉన్నారు.

కుంకుమ పూజలు

తణుకు టౌన్: కార్తీక మాసం సందర్భంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శుక్రవారం దానేశ్వరి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఆలయ కమిటీ చైర్మన్ కాపకాలయ సత్యనారాయణ, గ్రామ వైసీపీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ పీఎంకే జ్యోతి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో సమ్మెటివ్-1 పరీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. అదే విధంగా స్కూల్స్ రికార్డ్స్‌ను తనఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ నాని తదితరులు పాల్గొన్నారు.

నారుమడి చివర్లు తుంచాలి

తాడేపల్లిగూడెం రూరల్: నాట్లు వేసుకునే ముందు రైతులు నారుమడి చివర్లు తుంచాలని, తద్వారా కాండం తొలిచే పురుగు గుడ్లను నివారించవచ్చని ఏడీఏ పి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో రాజు వ్యవసాయ క్షేత్రంలో వరి నాట్లను ఏవో ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ నాట్లు వేసుకునే వారం రోజులు ముందుగా ఐదు సెంట్లు నారుమడికి ఒక కిలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కోస్తున్న రైతులు త్వరితగతిన ఒబ్బిడి చేసుకోవాలన్నారు. రాబోయే మూడు, నాలుగు రోజులు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బరకాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌ఛార్జ్ అలేఖ్య, రైతులు పి.రాజు, సతీష్ పాల్గొన్నారు.

చదరంగం పోటీలు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల బాలికల చదరంగం సెలక్షన్స్ శుక్రవారం స్థానిక మాగంటి అన్నపూర్ణ కల్యాణ మండపం హాల్‌లో నిర్వహించారు. అండర్ 6, 8, 10, 12, 14, 16 విభాగాలలో 120 మంది బాల బాలికలు పోటీ పడ్డారు. అకాడమీ చైర్మన్ సీహెచ్ ఆర్‌కే వర్మ గెలుపొందిన విజేతలను అభినందించారు. చెస్ అకాడమీ ప్రతినిధి చంద్రశేకర్ పోటీలను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని తణుకు, ద్వారకా తిరుమల, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి బాల బాలికలు హాజరైనట్లు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- పలు ప్రాంతాల్లో నందడిగా వై ఏపీ నీడ్స్ జగన్



అత్తిలి: స్కిన్నెరపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తాడేపల్లిగూడెం రూరల్: ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్

అత్తిలి: రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదవర్గాలకు పారదర్శకంగా సంక్షేమం అందాలంటే సీఎంగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూంలు, బైజూస్‌యాప్‌ను మన ప్రభుత్వంలో మన పిల్లలకు అందించడం జరిగిందన్నారు. అంతర్జాతీయ సమ్మిట్‌లో మన ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలు మంచి ప్రతిభ కనబర్చి ప్రపంచ దేశాల ప్రతినిధులను కలుసుకుని వారి ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరొక ముందుడుగు వేసి విద్యాదీవెన, విద్యాకానుక, అమ్మ ఒడి, మనబడి నాడు-నేడు వంటి పథకాలను ప్రవేశపెట్టి అందరిమన్ననలు పొందుతున్నారని తెలిపారు. ముందుగా పార్టీ పతాకాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఎగురవేశారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ అడ్డాల భానులలిత మహాలక్ష్మి, ఎంపీటీసీ కూరాకుల లక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కార్యదర్శి పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు శింగంశెట్టి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, గనిశెట్టి రాముడు, ఎంపీడీఓ అమీలుజమా, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తణుకు టౌన్: ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా పాలన సాగిస్తున్నారని తణుకు పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ చెప్పారు. శుక్రవారం సాయంత్రం తణుకు పట్టణం వెంకట్రాయపురం 16వ సచివాలయం వద్ద నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలని అనే అంశంపై ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ తణుకు పట్టణంలోని పేదలకు 145 ఎకరాలను సేకరించి పేదల సొంతింటి కల నిజం చేశారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు గుబ్బల సూర్యచంద్రరావు, సచివాలయ కన్వీనర్ యల్లమిల్లి రమేష్ బాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, తాతపూడి వరప్రసాద్, చదలవాడ బాబూరావు, ఉమ్మడి సింగ్ శ్రీను, పేకేటి విజయలక్ష్మీ, వరలక్ష్మీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం జగన్‌తోనే సాధ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సంక్షేమ రాజ్యం ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అధ్యక్షత వహించారు. ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పథకాల అమలులో గత ప్రభుత్వం, ప్రస్తుత జగన్ ప్రభుత్వ తీరును ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో తిరిగి జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలని తెలిపారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామానికి చేకూరిన లబ్ధితో కూడిన బోర్డును ఆవిష్కరించారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొమ్ముగూడెం, నవాబుపాలెం సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, ఎమ్పీటీసీలు నార్ని నాగులు, మార్లపూడి సుబ్బారావు, వార్డు మెంబర్లు అడ్డాల గోపీ, ముప్పిడి లక్ష్మణరావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, కార్యదర్శులు కే.శ్రీనివాసరావు, ఫణి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రజాసంక్షేమం

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే మరింత ప్రజాసంక్షేమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. స్థానిక 6వవార్డు టిటిడి కళ్యాణ మండపం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, వార్డు ఇన్‌ఛార్జి మద్దుల ప్రసాద్, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, వట్టి బుజ్జి, దుర్గారావు పాల్గన్నారు.

రాష్ట్ర ప్రజలకు జగనన్నే ప్రత్యేక భరోసా

పెంటపాడు: రాష్ట్రంలో పేదల, అభివృద్ధి సంక్షేమం కోసం పాటు పడుతున్న జగనన్నే ప్రజలకు ఒక భరోసా అని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. పెంటపాడు మండలం మీనవిల్లూరు సచివాలయం వద్ద మీనవిల్లూరు, రామచంద్రపురం గ్రామాలకు సంబంధించి శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకులు చల్లా లింగమూర్తి, చింతపల్లి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ హైమావతి తదితరులు తొలుత గ్రామంలో సంక్షేమ అభివృద్ధిపై పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైలవరపు పెదబాబు, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, రామచంద్రపురం గ్రామ మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి, దాసి పండు, నేలపాటి వెంకట్రావు, తిప్పా సాయి, కొండ్రెడ్డి సత్యనారాయణ, రమేష్, కార్యదర్శులు అప్పలరాజు, దుర్గ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఇరగవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలో సంక్షేమ పథకాల బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంత అవసరమో వివరిస్తు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు గ్రామాలోని కుటుంబలు వద్దకు వెళ్లి చేకూరిన లబ్ధి, పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, రేలంగి సర్పంచ్‌లు చేబ్రోలు స్వరాజ్యం, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, ఎంపీటీసీలు మహాలక్ష్మి, మెంటరాజు, కిరణ్మయి, రేలంగి సొసైటి అధ్యక్షుడు నడుంపల్లి రాంబాబు రాజు, ఎంపీడీవో ఎ శ్రీనివాస్ , ఈవోపిఆర్డీ నరసింహ మూర్తి, గ్రామా పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, మైనం పాము, వడ్డే మార్కండేయులు, పులుపు సునీల్, కాసాని సత్యనారాయణ, కార్యదర్శి బి లక్ష్మి నారాయణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



పెంటపాడు: మీనవిల్లూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఇరగవరం: రేలంగిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



తణుకు టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ

ఇంటింటా సంక్షేమం జగన్‌కే సాధ్యం



అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో లబ్ధిదారులకు బ్రోచర్లు అందజేస్తున్న మంత్రి కారుమూరి

- మంత్రి కారుమూరి
- స్కిన్నెరపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

అత్తిలి: ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో శుక్రవారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూర్చామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు బటన్‌నొక్కి మీఖాతాకే జమ చేస్తున్నారని, ఇటువంటి సంక్షేమపాలన కొనసాగాలంటే తిరిగి మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో కోటి ఇరవై లక్షలు ఖర్చుచేస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో ఇప్పటి వరకు సుమారు 21 కోట్లు సంక్షేమ, అభివృద్ధి పథకాలకు వెచ్చించామన్నారు. గ్రామంలో ఉన్న ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ అడ్డాల భానులలిత మహాలక్ష్మి, ఎంపీటీసీ కూరాకుల లక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ పెన్మెత్స రామరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, ఎమ్మెల్యో వెలగల విజయభాస్కరరెడ్డి, గనిశెట్టి రాముడు పాల్గొన్నారు.

ఆడపిల్ల చదువు సమాజానికి మేలు

అత్తిలి: బాల్య వివాహాలు అనర్థదాయకమని, ఆడపిల్లలు కనీసం చదువుకోవడం సమాజానికి మేలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. శుక్రవారం అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామంలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని కోరారు. ఆడపిల్లను పుట్టనిద్దాం-ఆడపిల్లను రక్షిద్దాం- ఆడపిల్లను చదివిద్దాం అని ప్రతిజ్ఞ చేయించారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: నియోజకవర్గంలో ఈ నెల 2, 3వ తేదిల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.దుర్గేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా తేదిల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే మృతుల తొలగింపు, అడ్రస్ మార్పునకు, బదలాయింపునకు ఈ నెల 9వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సభ నిర్వహించారు. అనంతరం పుల్లాయగూడెం గ్రామంలోనూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సభ నిర్వహించారు.

కోఆపరేటివ్ బ్యాంకు రజతోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

తణుకు: ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు ఎల్లప్పుడూ ముందుంటుందని బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. బ్యాంకు రజతోత్సవాల సందర్భంగా తణుకు బ్యాంకు శాఖ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. బ్యాంకు స్థాపించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగిడిన తరుణంలో ఇప్పటికి వివిధ జిల్లాలో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. బ్యాంకు ప్రారంభమైన అతి తక్కువ కాలంలోనే అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో జాతీయ స్థాయి అవార్డులను కూడా పొందామన్నారు. ప్రస్తుతం 17,300 మంది సభ్యులతో రూ.31 కోట్లు వాటా ధనం పొంది, రూ. 1330 కోట్ల వ్యాపారంతో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకింగు రంగంలోనే ముందంజలో ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ ఖాతాదారులకు బ్యాంకు చైర్మన్ సాలువాతో సత్కరించి, మెమొంటోలను అందజేశారు. బ్యాంకు డైరెక్టర్ సి.పి. రామారావు, బ్యాంకు ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్ కిషోర్, రీజనల్ మేనేజరు జి.సింహాచలం, శాఖ మేనేజరు టి.కె.పోతురాజు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవం... కన్నుల వైభవం



కోటి దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

పెంటపాడు: కార్తీకమాసం పురస్కరించుకొని చింతపల్లి గ్రామంలో భీమేశ్వరస్వామి ఆలయం వద్ద కోటి దీపోత్సవ కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొంది. గ్రామంతో పాటు, రావిపాడు, బోడపాడు, అలంపురం, కాశిపాడు, కోరిమిల్లి తదితర గ్రామాలకు చెందిన మహిళలు కోటి దీపార్చనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనేత కొట్టు విశాల్, పేరిచర్ల కిరణ్‌కుమార్‌రాజు, దాట్ల రామలింగరాజు, డాక్టర్ శ్రీను, ముదునూరి జయరామ్, ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండ మోగుల సాంబయ్య, సచివాలయాల కన్వీనర్ మైలవరపు పెదబాబు, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, తదితరులతో పాటు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, నల్లిమిల్లి విజయానందరెడ్డి, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదు



అత్తిలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సీనియర్ సివిల్‌జడ్జి కె ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని ఒకటవ అదనపు జిల్లా జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్‌కేర్ సెంటర్‌లో న్యాయమూర్తి అధ్యక్షతన న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, డాక్టర్ సాయిబాలాజీ, ఎంఎల్‌ఏస్‌సీ సభ్యులు ఎం.సుబ్బయ్య, న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

అత్తిలి: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కె నాగరాజు, డాక్టర్ ఆర్ సురేఖ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో పి మురళి, హెచ్ఈ జి ప్రమీలారాణి, ఎంపీహెచ్ఎస్ ఎస్ వెంకట్రాజు, ఎంపీహెచ్‌ఏ జెఎస్ గనిరాజు, ఆశ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని లయన్స్‌క్లబ్ జిల్లా గవ్నరర్ గట్టిం మాణిక్యాలరావు, డీసీహెచ్ఎస్, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణ, డైమండ్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజులు పేర్కొన్నారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో శుక్రవారం వరల్డ్ ఎయిడ్స్ డేను నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు, మహిళలకు, పురుషులకు 150 మందికి బియ్యం, పప్పులు, బెల్లం, ప్రోటినెక్స్, వేరుశెనగలు, నిత్యావసర వస్తువులు అందజేశారు. డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, ఛైర్‌పర్సన్ కోనా హనుమాన్, డాక్టర్ కమల, కుందుం వెంకటేశ్వరరావు, జామి సత్యనారాయణ, పెద్దబాబు, ప్రసాద్ కోనా భువన్, పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుడ్ ల్యాంప్ సంస్థ ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించింది. ఈ ర్యాలీని తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె ప్రకాష్‌బాబు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవి ఇంజినీరింగ కళాశాల, ఆదిత్య జూనియర్ కళాశాల, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి సిబ్బంది, రైడ్స్, గుడ్‌ల్యాంప్ పీడీ టిఎస్ సుకుమార్, పిఎం అభిషేక్, రమేష్, నందు, ఎస్సై సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అపోహలు వీడాలి

పెంటపాడు: మండలంలోని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై ఆపోహలు వీడనాడాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.